స్నిగ్ధ శ్రీదేవి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 77వ ఉచిత హోమియో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో 100 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా హోమియో మందులు ఇవ్వడం జరిగిందని ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు టి.జగన్నాథరావు, టిజె మోహన్, ఫౌండేషన్ ప్రతినిధులు కేఎస్ఎన్ మూర్తి, కె.చంద్ర శేఖర్, కేవి భానోజీరావు, కే.శ్రీనివాసరావు, ఫౌండేషన్ సభ్యులు వి.రాం బాబు, వి.శ్రీనివాసరావు, ఎం.శంకర్, గంధ రాము, కిషోర్, వి.లక్ష్మణ్, వి.తాతాజి పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ నిర్వీర్యం

ఏఐఎస్ఎఫ్ 32వ జిల్లా మహాసభల్లో యూపీఎస్సీ మాజీ సభ్యులు ప్రొఫెసర్ కె.ఎస్.చలం

ఏఐఎస్ఎఫ్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా పి.శేఖర్, యు.నాగరాజు

విశాలాంధ్ర - విశాఖ: ప్రస్తుత దేశంలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని ద్రవిడ యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి, యూపీఎస్సీ మాజీ సభ్యులు ప్రొఫెసర్ కె.ఎస్.చలం అన్నారు. ఏఐఎస్ఎఫ్ 32వ జిల్లా మహాసభలు ఆంధ్రా యూనివర్సిటీ టి ఎల్ ఎన్ సభా హాల్లో ఎన్.శ్రీను అధ్యక్షతన ఆదివారం జరిగాయి. యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు డాక్టర్ క్షేత్రపాల్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ రంగ సంస్థల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు మాట్లాడుతూ స్వాతంత్ర పోరాట చరిత్ర కలిగిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. అనేక విరోచిత పోరాటాలు చేసి గత 89 సంవత్సరాలుగా విద్యార్థుల పక్షాన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 18 యూనివర్సిటీలలో విద్యార్థులకు మౌలిక వసతులు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, నాన్ టీచింగ్ పోస్టులు 3500 పైగా ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలన్నారు. విద్యార్థులకు ల్యాబ్స్ పూర్తిస్థాయిలో అందుబాటులో లేవని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు పౌష్టికాహారం లోపించి ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న యూనివర్సిటీలన్నీ రాజకీయ కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయని, ఆ కుట్రలను అడ్డుకోవాలసిన బాధ్యత విద్యార్థి సంఘం నాయకులుగా మనపై ఉందని తెలిపారు. 32 మంది ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించే వరకూ పోరాటం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

నూతన కార్యవర్గం:

ఏఐఎస్ఎఫ్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా పి.శేఖర్, యు.నాగరాజు ఎన్నికయ్యారు. 25 మంది నూతన కౌన్సిల్, 11 మంది కార్యవర్గం, ఏడుగురు ఆఫీస్ బేరర్స్‌తో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీబీఐ వలలో వాల్తేర్ రైల్వే డిఆర్ఎం

25 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వాల్తేర్ రైల్వే డివిజన్ డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ సీబీఐ అధికారులకు చిక్కాడు. ప్రస్తుతం సెలవులో ఉన్న సౌరభ్ ప్రసాద్ లంచం డబ్బును ముంబైలో తన ఇంటికి వచ్చి ఇవ్వాలని సూచించాడు. దాంతో కాంట్రాక్టర్ ముంబై వెళ్లి రూ.25 లక్షలు లంచం ఇస్తుండగా, సీబీఐ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇదే క్రమంలో ఇటు విశాఖలోని డీఆర్ఎం బంగ్లాలో సీబీఐ శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ సీబీఐ సోదాలు జరిపింది. ఢిల్లీ, విశాఖకు చెందిన రెండు బృందాలు ఈ సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ సోదాల్లో పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుంది. లంచం తీసుకుంటూ దొరికిపోయిన డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌ను సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

వైభవంగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయంలో ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. శనివారం ఆలయ వైదిక సిబ్బంది ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారి ఆనంద్ కుమార్, పర్యవేక్షణాధికారి ప్రసాద్ పర్యవేక్షణలో స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కళ్యాణ మండపంలో అధిష్టింపజేసి స్వర్ణ పుష్పార్చన, పిదప వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి నిత్య కళ్యాణం జరిగింది. కార్తీక మాసం మూడవ ఆదివారం సందర్భంగా సింహాచలం పరిసర ప్రాంతాల్లో వనభోజన కార్యక్రమాలు అధికంగా జరిగాయి.

రోడ్డు పనుల పరిశీలన

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డులో పాపయ్యరాజుపాలెం నుండి లక్ష్మీపురం వసంత గార్డెన్ వరకు, జీవీఎంసీ నిధులు కోటి రూపాయలతో తారు రోడ్డు పూర్తయింది. తాజాగా వసంత గార్డెన్ నుండి లక్ష్మీపురం జంక్షన్ వరకు 11.40 లక్షలు జీవీఎంసీ నిధులతో జరుగుతున్న తారు రోడ్డు పనులను బీజేపీ నేత, జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించి తారు రోడ్డు పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వీరభద్ర, బీజేపీ నాయకులు పిడివి.ప్రసాద్, కంచిబోయిన వెంకట సంతోష్, చిక్కాల సతీష్, వెంకటేష్, కాలని ప్రతినిధులు ధ్రువతార్, ప్రసాద్, నారాయణ, శ్రీరామ మూర్తి, శ్రీనివాసరావు, దాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

- క్రికెట్ విజేతలకు బహుమతులు అందించిన గండి బాబ్జి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని టిడిపి పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ స్పోర్ట్స్ స్టేడియంలో శనివారం జరిగిన ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు మ్యాచ్‌కు ఆయన విశాఖ దక్షిణ నియోజక వర్గం టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్‌తో కలిసి హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా క్రీడాకారులకు క్రీడా స్ఫూర్తి అత్యంత అవసరమన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం క్రీడా స్ఫూర్తి చాలా వరకు తగ్గిపోతోందన్నారు. క్రీడల ద్వారానే ఆరోగ్యంతో పాటుగా సమాజం పోకడలను అర్థం చేసుకునే వెసులుబాటు, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులందరికీ శుభాకంక్షలు తెలియజేసి బహుమతులు అందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం

విశాలాంధ్ర - మల్కాపురం: 57వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం ఘనంగా జరిగింది. అనేకమంది కవులు తమ కవితలను ఆహుతులకు వినిపించారు. ప్రముఖ పాత్రికేయులు సుంకర చలపతిరావు కాలం - ఖర్మం అనే కవితను, షిప్ యార్డ్ రచయితల సంఘానికి చెందిన జి.కె.వి.రాజు తెలుగు భాష ఔన్నత్యంపైన, జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి అంబేద్కర్ భావాలపైన, ప్రముఖ కవి కె.సత్తిరాజు తెలుగు ప్రజల మనోభావాలపైన, ప్రముఖ కార్మిక నాయకులు బి.సత్యానందం ధరల పెరుగుదల పైన, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.వి.ఎస్. భాగ్యలక్ష్మి మొక్కల పెంపకంపైన తమ కవితలను వినిపించారు. కార్యక్రమానికి జి.కె.వి.రాజు అధ్యక్షత వహించారు. కవి సమ్మేళనాన్ని గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ సమన్వయ పరిచారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక టీడీపీ నాయకులు కాకి పోలిరెడ్డి హాజరై కవులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పీలా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ టిడిపి ఫ్లోర్ లీడర్, 96వ వార్డ్ కార్పొరేటర్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పీలా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పెందుర్తిలో గల ఆయన స్వగృహంలో జరిగిన వేడుకల్లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సహా ఎన్‌డీఏ కూటమికి చెందిన పలువురు కార్పొరేటర్లు సీనియర్ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు కేకు కత్తిరించి అభిమానులకు నాయకులకు తినిపించారు. పీలా జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఆయన అభిమానులు ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకు ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు.

వినియోగదారుల హక్కుల చట్టం పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - మల్కాపురం: వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం అంకితభావంతో సేవలందిస్తున్న జాతీయ వినియోగదారుల హక్కుల కమీషన్ జాతీయ చైర్మన్ డాక్టర్ సాయి రమేష్ గౌడ్, సౌత్ ఇండియా చైర్మన్ దాడి సత్యనారాయణ, నేషనల్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రాజు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆర్డినేటర్ శంకర్, దాడి లక్ష్మణ్‌లు మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ ప్రత్యేక సమావేశం వినియోగదారుల హక్కులు, రక్షణ, సాధికారతపై విస్తృతంగా చర్చించే ఒక గొప్ప వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కుల పరిరక్షణలో కీలకంగా నిలిచే "వినియోగదారుల హక్కుల చట్టం" పుస్తకాన్ని గవర్నర్ కంభంపటి హరిబాబు చేతులమీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ పుస్తకం వినియోగదారుల హక్కుల చట్టంలోని ప్రధాన అంశాలు, ప్రాధాన్యతలు, వినియోగదారులు పొందగల సదుపాయాలను స్పష్టంగా తెలియజేస్తుంది. వినియోగదారుల కష్టసమస్యలను పరిష్కరించుకునే హక్కులు, వాటిని ఉపయోగించుకునే విధానం వంటి అంశాలను సులభమైన భాషలో అందజేసిన ఈ పుస్తకం వినియోగదారులకు ఒక మార్గదర్శిగా నిలుస్తుంది. అంతేకాక, వినియోగదారుల సాధికారతకు ప్రేరణనిచ్చే ప్రత్యేక ఫ్లకడ్స్ ను కూడా ఈ సందర్భంగా ఆవిష్కరించారు. వినియోగదారుల హక్కులపై చైతన్యాన్ని పెంచేందుకు వీటిని వివిధ చోట్ల ప్రదర్శించనున్నారు. ఫ్లకడ్స్ వినియోగదారులకు తమ హక్కులను గుర్తుంచుకుని చట్టబద్ధంగా తమ హక్కులను రక్షించుకోవడంలో ప్రేరణనిస్తుంది. ఈ కార్యక్రమంలో గవర్నర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ వినియోగదారులు ప్రతి రోజు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వీరికి తగిన రక్షణ ఇవ్వడం, వారి హక్కుల పరిరక్షణ కొరకు చైతన్యాన్ని పెంచడం మనందరి బాధ్యత. వినియోగదారుల హక్కుల సాధనకు ఇటువంటి పుస్తకాలు అవగాహన కార్యక్రమాలు ఎంతో సహకరిస్తాయని అభిప్రాయపడ్డారు.

గౌరీపరమేశ్వరుల అమ్మవారి సారె ఊరేగింపు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 40వ వార్డు ఏకే, ఏఎస్‌సీ కాలనీలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా ఆదివారం పురవీధుల్లో అమ్మవారికి సారె ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ముందుగా గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బుద్ధా శివాజీ, శరగడం గంగరాజు, ఆడారి మహేష్, రాపేటి రమణ, శరగడం నాగేష్, ఎల్లపు గోవింద, శరగడం రాజు, బొడ్డేటి చిన్న, బొడ్డేటి నూకరాజు, రాపేటి గోవిందా మిగతా గౌరీ సేవా సంఘ సభ్యులు, అయ్యప్ప, భవాని మాలదారులు భక్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి

ఎమ్మెల్యేలకు జర్నలిస్టుల వినతి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని, వారి సంక్షేమానికి నిధులు కేటాయించాలని జర్నలిస్ట్ సంఘాలు ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేసారు. ఈ మేరకు సీతంపేటలోని ఆయన నివాసంలో ఆదివారం కలసి జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా అసెంబ్లీలో వారి సమస్యలను చర్చించి ప్రత్యేక నిధులు కేటాయించాలని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. జనసేన జిల్లా అధ్యక్షుడు విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేసి డిప్యూటీ ముఖ్యమంత్రి తీసుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం జర్నలిస్టులకు 4 సెంట్లు ఉచితంగా ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైర్డ్ జర్నలిస్టులకు రూ.10 వేల పెన్షన్ సదుపాయం, కోవిడ్‌తో చనిపోయిన జర్నలిస్టులకు రూ.5 లక్షల పరిహారం, ప్రెస్ అక్రిడేషన్ల పెంపు, జర్నలిస్టులపై దాడుల నివారణకు హై పవర్ కమిటీలు ఏర్పాటు, ప్రమాద బీమా పునరుద్ధరణ, స్థానిక పత్రికలకు చేయూత తదితర సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా బిజెపి రాష్ట్ర నాయకులు, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు నగరంలో అందుబాటులో లేకపోవడంతో ఆయనతో ఫోన్‌లో జర్నలిస్టుల సమస్యలపై మాట్లాడి వినతిపత్రాన్ని పంపారు. సమస్యల పరిష్కారానికి తగిన కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్య నారాయణ, ఏపీయూడబ్ల్యూజే గాజువాక యూనిట్ అధ్యక్షుడు కొయిలాడ పరశురాం, జాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఎం.కీర్తన్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందు యాదవ్, ఏపీజేయూ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీహరి పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం స్పందించాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించవలసిన 11వ పి.ఆర్.సి, డి.ఎ, సరెండర్ లీవ్ బకాయిలు, పిఎఫ్, ఏపీజిఎల్ఐ తుది చెల్లింపులు, ఋణాల చెల్లింపులపై ప్రభుత్వం ఇంతవరకు స్పందించలేదని ముఖ్యమంత్రి వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ఎప్పటిలోగా చెల్లిస్తారో ప్రకటించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆం.ప్ర (ఎస్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం విశాఖలోని చంద్రాస్ హోటల్ సమావేశ మందిరంలో జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడారు. 12వ పీఆర్సీ అమలు చేయవలసిన గడువు ఇప్పటికే 17 నెలలు ఆలస్యమైందని, వెంటనే 30% మధ్యంతర భృతి ప్రకటించి పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల భారం తగ్గిస్తామన్న ప్రభుత్వం ఆచరణలో చూపడం లేదన్నారు. పాఠశాలలో అమలు చేస్తున్న బోధనేతర కార్యక్రమాలు, యాప్‌లతో ఉపాధ్యాయులకు మానసిక ప్రశాంతత కరువైందన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేకపోవడంతో రెండు దశాబ్దాలుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా ఉందన్నారు. సి.పి.ఎస్ రద్దుపై అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామన్న ప్రభుత్వం ఆ దిశగా ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు మెమో నెం.57 మేరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపచేయవలసి ఉండగా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 62 సంవత్సరాల పదవీ విరమణ వయస్సు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్లస్ టు పాఠశాలలను ప్రారంభించి ఉపాధ్యాయులను మాత్రం నియమించలేదన్నారు. పురపాలక ఉన్నత పాఠశాలల్లో ఎస్జిటి తత్సమాన పోస్టులను వెంటనే ఉన్నతీకరించాలన్నారు. గత ఐదు సంవత్సరాలుగా డీఎస్సీ నిర్వహించకపోవడంతో వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఉపాధ్యాయులకు పని భారం పెరిగిందన్నారు. విద్యారంగ సమస్యలపై, ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల ఆర్థిక బకాయిలపై ప్రభుత్వం స్పందించకపోతే ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డి.శ్యాం, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దేముడు బాబు, పైడిరాజు, రమణమూర్తి, తమ్మి నాయుడు, కె.జోగా రావు, సూరిబాబు, రవి, పరదేశి, వరలక్ష్మి, పురుషోత్తం, సీనియర్ నాయకులు జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

దంతరక్షణపై గీతం దంతవైద్య విద్యార్థుల ఫ్లాష్ మాబ్

విశాలాంధ్ర - మధురవాడ: బాలలలో నోటి ఆరోగ్య ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించడానికి గీతం దంత కళాశాల, ఆసుపత్రి వైద్యవిద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైఎంసీఏ వద్ద ఫ్లాష్ మాబ్, వీధినాటిక, ప్రసంగ కార్యక్రమాలను నిర్వహించారు. గీతం దంత కళాశాల, ఆసుపత్రి పీడియాట్రిక్స్, ప్రివెంటివ్ డెంటిస్ట్రీ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల దంత సంరక్షణ, ఆరోగ్యకరమైన పద్ధతులు, బ్రష్ చేసుకునే విధానంపై వైద్యులు ప్రసంగించారు. అందమైన, ఆరోగ్యకరమైన దంతాలు పూర్తి ఆరోగ్యానికి చాలా అవసరమైనవని, ముఖ్యంగా పిల్లలు తినడం, మాట్లాడటంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయని వారు తెలిపారు. బలహీనమైన దంతాలు, అపరిశుభ్రమైన నోరు కారణంగా రకరకాల ఇన్ఫెక్షన్లు, వ్యాధులు, క్యావిటీస్ వంటి సమస్యలు వస్తుంటాయని, అలాగే దంతాలు ఊడిపోవడం, వాటి అరమరిక విషయంలోనూ సమస్యలు వచ్చే అవకాశాలు న్నాయని వీటిపై పిల్లలకు అవగాహన అవసరమని తెలిపారు. నగరంలోని పాఠశాలల విద్యార్థుల దంత రక్షణ కోసం "శిశుగీతం" అనే కార్యక్రమాన్ని గత 15 రోజులుగా నిర్వహించామని, బాలలలో నోటి ఆరోగ్య ప్రాధాన్యతను పెంపొందించడానికి ఉద్దేశించబడిన ఈ కార్యక్రమంలో 20కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దంత పరీక్షలను నిర్వహించినట్లు గీతం దంత కళాశాల, ఆసుపత్రి ప్రిన్సిపాల్ డా. వివి నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్స్ విభాగాధిపతి డా. సిఎస్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గుడిలోవలో మహా అన్నదానం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో శ్రీ రంగనాథ స్వామి దేవాలయం, గుడిలోవ ఆలయం వద్ద కార్తీకమాసం మూడో సోమవారం పురస్కరించుకొని సుమారు 3 వేలు మంది భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కావున భక్తులందరూ విచ్చేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని భక్తులు చందక వెంకటరమణ (శివ), సోమినాయుడు, శంకర్, సంతోష్ తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని ఆనందపురం గ్రామపంచాయతీలో వెలసిన శ్రీ నారాయణేశ్వర పార్వతి అమ్మవార్ల దేవస్థానం శివాలయం వద్ద కార్తీక మాసం సందర్భంగా శ్రీ పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కళ్యాణానికి భక్తులు అందరి సహాయ సహకారాలతో ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సుమారు 2000 మంది భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి, ఆలయ అర్చకులు రాంబాబు సుబ్రమణ్యం, షినగం చిన్న రామారావు, అప్పలస్వామి శంకర్రావు, రవణమ్మ అప్పలనాయుడు, శ్రీ విఘ్నేశ్వర యువజన సేవా సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జొన్నాడ టోల్ ప్లాజాలో ఉద్యోగ అవకాశాలు

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండలం బోరుమట్ట పాలెం పంచాయతీలో గల టోల్ ప్లాజాలో పదవ తరగతి పాస్ అయిన పది కిలోమీటర్ల లోపు యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ఉద్యోగంలో చేరదలసిన వారికి తెలుగు, ఇంగ్లీష్ రాయటం చదవడం రావాలని హిందీ తెలిసి ఉండాలని టోల్ ప్లాజా సిబ్బంది తెలియజేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిధిగా కళసాహితీ ప్రెసిడెంట్ పి.రాజేంద్ర వర్మ హాజరయ్యారు. బొమ్మలు వేయడం గురించి అవగాహన కలిగించారు. ఎంపీ యుపి స్కూల్ మాస్టర్ సత్యనారాయణ, శశి స్కూల్ కంప్యూటర్ మాస్టర్ అప్పలరాజు, గ్రంథాలయాల అధికారి మహేష్ పాల్గొన్నారు.

జయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 60వ వార్డు ఇందిరా కాలనీ -2 కొండపైన వెలసియున్న శ్రీ శ్రీ శ్రీ జయదుర్గా అమ్మవారి ఆలయ 5వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాహస శిక్షణా శిబిరానికి ఏయూ విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకానికి చెందిన పదిమంది విద్యార్థులు జాతీయ సాహస శిక్షణా శిబిరానికి ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలిలో జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి వీరు హాజరవుతారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు తన కార్యాలయంలో అభినందించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రోగ్రాం అధికారిగా డాక్టర్ పల్లవి పాల్గొంటారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య జి శశిభూషణరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వలన నాయకత్వ లక్షణాలు బృంద నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని అన్నారు కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్. హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలే తలసేమియా బాధితులకు ప్రాణదాతలు

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

విశాలాంధ్ర - గాజువాక: రక్తదాతలు ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే ప్రాణదాతలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. రక్తదానంపై యువత అవగాహన పెంచుకుని ముందుకు రావాలని హితవుపలికారు. గాజువాక పట్టణంలో గొడబ మనోజ్ కుమార్, లావణ్య దంపతుల కుమార్తె ప్రేరణ రెండవ పుట్టినరోజు సందర్భంగా తలసేమియా బాధిత చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ, తలసేమియా వ్యాధి ప్రాణాంతకమైనదని, అయితే అమెరికా వంటి దేశాలలో జీనోమ్ పద్ధతి ద్వారా చికిత్స అందు బాటులోకి వచ్చిందని అన్నారు. ఈ చికిత్సా విధానం వల్ల ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. తాను పోలీస్ అధికారిగా కాకుండా వైద్యునిగా కూడా కొన్ని సూచనలు చేస్తున్నానంటూ తలసేమియా వ్యాధి గ్రస్తుల కుటుంబ సభ్యులకు విలువైన సలహాలు అందించారు. జిల్లాలో ఎంతమంది బాధితులు ఉన్నారో గుర్తించి వివరాలు సేకరిస్తే వారికి వైద్య సహాయం అందించడానికి ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులకు సూచించారు. తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జన్మదిన వేడుకను పురస్కరించుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ద్వారా వినూత్నంగా నిర్వహించిన నిర్వాహకులు అభినందనీయులన్నారు. నిర్వాహకులు మనోజ్ కుమార్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా తలసేమియా బాధితుల కోసం ఈ రక్తదాన శిబిరాన్ని తమ కుమార్తె జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు గొడబ రాంబాబు, ధవళేశ్వరపు రవికుమార్, ఏసీపీ త్రినాథ్ , సీఐ పార్థసారధి , సీనియర్ న్యాయవాదులు వెన్నల ఈశ్వరరావు, రాంబాబు, వైసీపీ నాయ కులు దేవన్ రెడ్డి, కార్పొరేటర్ ఉరుకూటి చందు, స్థానిక టిడిపి నాయకులు మహ్మద్ రఫీ, గోమాడ వాసు, గొడబ దుర్గా ప్రసాద్, సునీత,కౌశిక్, పూరిమహంతి గణేష్, ప్రియ,ఛత్రపతి శివాజీ వాలంటరీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు సర్ధార్ వినయ్, సాయి గణేష్ , పి.నవీన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా నక్కపల్లి తాలూకా బ్రాహ్మణ సమారాధన

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో పెనుగొల్లు వద్ద నక్కపల్లి తాలూకా బ్రాహ్మణ సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్తీకమాసం వచ్చిందంటే చాలు. ప్రతీచోటా వనభోజనాలకు ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. ఆధ్యాత్మిక చింతనతోపాటు ఆనందం, ఆరోగ్య సందేశాన్ని కార్తీక వనసమారాధనలు మనకు అందిస్తున్నాయి. ముఖ్యంగా హైందవ సంస్కృతి, సంప్రదాయాలకు ఇటువంటివి ప్రతీకలుగా నిలుస్తాయి. ఊరూవాడా సందడిగా నిలవడమే కాదు. కార్తీక పౌర్ణమినాడు నైమిశారణ్యంలో మునులందరూ సూత మహర్షి ఆధ్వర్యంలో వనభోజనాలు ఏర్పాటు చేసుకున్నట్లు పురాణాల ద్వారా తెలుస్తుంది. ఉసిరిచెట్టుక్రింద కార్తీక దామోదరునిగా ప్రఖ్యాతుడైన శ్రీహరి ప్రతిమను ప్రతిష్ఠించి ఉసిరికలతో హరిని పూజించి గోవిందనామస్మరణ చేస్తూ షోడశోపచారాలతో. పూజించి అనంతరం వనభోజనాలు చేశారు అలా పూర్వం మహర్షులందించిన కార్తీక వనభోజనాలు ఇప్పటికీ ఏర్పాటుచేసుకుంటున్నాం. నలుగురితో కలిసి ఉల్లాసంగా ఉత్సాహంగా గడుపుతాం.

ఇదే సంప్రదాయాన్ని పాటిస్తూ ప్రతీ ఏటా నక్కపల్లి తాలూకా బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో పిల్లా పెద్దలతో కార్తీక వనసమారాధన లు నిర్వహించడం జరుగుతుంది. ఆదివారం పెనుగొల్లు సమీపంలో రాజుగారితోటలో నిర్వహించిన ఈ వనసమారాధన కార్యక్రమంలో ముందుగా వచ్చిన పెద్దలు సమీపంలో ఉన్న ఉసిరిచెట్టువద్ద ప్రత్యేక పూజలు పురోహితుల సమక్షంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా నిర్వహించారు. అనంతరం సమావేశం నిర్వహించి గత సంవత్స రంలో సంఘం తరపున చేసిన సేవాకార్యక్రమాలు తెలియజేశారు. దూర ప్రాంతాలలో స్థిరపడిన వారు సైతం కుటుంబాలతో సహా తరలివచ్చి ఆనందంగా గడిపారు. చిన్నారుల ఆటపాటలు పలువురిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో సంఘ నిర్వాహకులు శ్రీ పాద సత్యదేవా శర్మ,డి.వి.రామారావు శ్రీపాద ప్రణవ్, ఆచంట రామకృష్ణ, దాతరం మురళి కృష్ణ, దేవుల పల్లి అనంత పద్మ నాభ శర్మ,ఇంద్రకంటి చిన బాబీ ఎందుకు వి ఎస్ ఆచార్యులు. కృష్ణమాచార్యులు, శేషా చార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణుసహస్ర నామ పారాయణం లలిత సహస్ర నామ పారాయణం చేసారు. యువతి యువకులకి చిన్నారులకి అట ల పోటీ లు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వాడి వేడిగా చోడవరం మండల సర్వసభ్య సమావేశం

- సభ్యుల ఆరోపణలే తప్ప పట్టించుకునే నాథుడే కరువయ్యారు

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ గాడి కాసమ్మ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అందర్నీ కలుపుకు పోతానని హామీ ఇచ్చారు. సభ్యులు చేసిన పలు ఆరోపణలకు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు ఎటువంటి సమాధానం ఇవ్వకపోవడంతో సమావేశం వాడి వేడిగా సాగింది తప్ప అభివృద్ధికి ఎటువంటి ప్రణాళికలు లేవు. మండలాల్లో లక్ష్మీపురం హైస్కూలు అభివృద్ధి పథంలో నడుస్తున్నది తప్ప చోడవరం ప్రభుత్వ హైస్కూలు ఎందుకు అభివృద్ధి చెందలేదని అంకుపాలెం సర్పంచ్ నాగలపల్లి వెంకట ఉమా పరమేశ్వరి చందు రాంబాబు ప్రశ్నించారు. అలాగే గడిచిన ఐదు సంవత్సరాల నుంచి మండలం లో ఇప్పటివరకు జరిపిన ఉపాధి హామీ పనులపై ఎటువంటి ఆడిట్ నిర్వహించలేదని దీనికి కారణాలు ఏమిటి అని గవరవరం సర్పంచ్ ప్రశ్నించారు. అలాగే బెన్నవోలు కాలువల్లో పూడిక తీతలు తీయించాలని, దీనివలన కన్నంపాలెం, చాకిపల్లి, బెన్నవోలు తదితర ఐదు గ్రామాలుకు వెళ్ళే పంట కాలువలకు పూడికలు పెరిగిపోయి సాగు నీరు అందక రైతాంగం నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించిన ప్రజా సమస్యలపై అధికారులు ప్రజాప్రతినిధులు మౌనమే తప్ప తిరిగి సమాధానం చెప్పకపోవడంతో సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. అనంతరం ఎమ్మెల్యే రాజును ఎంపీపీ కాశమ్మతోపాటు అధికారులు సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు దుస్సాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, తాహసిల్దార్ పి. రామారావు, ఈవో.ఆర్.డి. ఒ.మహేష్, ఈ.వో నారాయణరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర -విశాఖ సిటీ: తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు సభ్యత నమోదు కార్యక్రమం 20 వ వార్డు గాంధీ సెంటర్ వద్ద వార్డు అధ్యక్షులు బైరెడ్డి పోతన్న రెడ్డి ఆధ్వర్యంలో పెద్దవాల్తేర్ బూత్ లకు సంభందించి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభి రాం చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంని ఉద్దేశించి పట్టాభి రాం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ సభ్యత నమోదు కార్యక్రమాలు వేగవంతం గా జరుగుతున్నాయన్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గం లో కూడా సభ్యత్వం వేగవంతం గా జరుగుతుంది అని, ప్రతి ఒక్క సభ్యునికి 5 లక్షల రూపాయల భీమా సౌకర్యం కూడా ఇవ్వడం జరుగుతుంది అని, కార్యకర్తల నిరుపేద కుటుంబాలకు , విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాయం అందుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో పి. వాసు, మద్ది శ్రీను, మామిడి సురేష్, పిడింట్ల శ్రీను, చింతపల్లి సూర్యనారాయణ, కంబావు శివారెడ్డి, కాకి శివ, మరడ సీతన్న, గోపి, శివ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తాళ్లపాలెం గ్రామంలో అయ్యప్ప పడి పూజ

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో రామాలయం ఆవరణంలో అయ్యప్ప శరణు గోషతో ఆదివారం రాత్రి మార్మోగింది. పూజ పెట్టిన రోమాల నూకరాజు అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం గురుస్వాములు కలగ సోమేశ్వరరావు, గొన్నబత్తుల గోవింద, ద్వారపురెడ్డి రవిలు మ త్రోచ్ఛారణ మద్య సాగింది. ప్రత్యేక వేదికపై అయ్యప్ప, గణప

తి, సుబ్రమణ్య ఉత్తవ మూర్తులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. పంచామృత అభిషేకం నిర్వహించి అర్చన, అష్టోత్తర శతనావలి జరిపారు. పదునెట్టాంబడిపి ప్రత్యేక పూజలను నిర్వహించిన గురుస్వామి అయ్యప్ప స్వాములచే కర్పూర హరతులను అందించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు చేసిన భజనలతో ఆప్రాంతం భక్తి గీతాలతో మారు మోగింది. అయ్యప్ప స్వాములకు,గ్రామస్థులు బిక్షను అందించారు.

నగరంలో ప్రముఖ గాయని సునీత లైవ్ మ్యూజికల్ నైట్

- డిసెంబర్ 6న ఎంజీఎం పార్క్‌లో నిర్వహణ

విశాలాంధ్ర - విశాఖపట్నం: ప్రముఖ గాయని సునీత ఉపద్రష్ట తొలిసారిగా వైజాగ్‌లో లైవ్ పెర్ఫార్మెన్స్ ఏర్పాటు చేస్తున్నారు. నేతృత్వంలోని సీన్ సెట్టర్స్ ప్రిజం క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గాయని సునీత సంగీత కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు మాట్లాడుతూ మ్యూజికల్ మిస్ట్ పేరుతో సునీత ఉపద్రస్త లైవ్ ఇన్ కాన్సర్ట్ పార్క్ హోటల్ సమీపంలోని ఎంజీఎం పార్క్ లో డిసెంబర్ 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మ్యూజికల్ నైట్‌కి సంబంధించిన టికెట్లు బుక్ మై షోలో లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిఖిల్ విజయేంద్ర సింహా, ప్రణీత్ పారేపల్లి పాల్గొన్నారు. గాయని సునీత మాట్లాడుతూ సముద్ర తీరంలో తనకు ఇష్టమైన ప్రకృతిలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. తన చిరకాల కోరిక ఈ కార్యక్రమంతో నెరవేరుతోందని అన్నరు. గత 5 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో బ్యాండ్ సంస్కృతి మొదలయిందని, ఈ మధ్య కాలంలో క్లబ్ లు, పబ్‌లలో ప్రముఖ సంగీత దర్శకుల పాటలు ఈ బ్యాండ్‌ల ద్వారానే వింటున్నామని అన్నారు.

నాలుగవ రోజుకు చేరుకున్న మత్స్యకారుల రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర - భీమిలి: అణువణువునా తీరప్రాంతం ఆక్రమణకు గురై కబ్జాదారుల కబంద హస్తాల్లో చిక్కుకొని విధ్వంసం చేస్తున్న సదరు వ్యక్తులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మత్స్యకారుల నాయకుడు, గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు ప్రశ్నించారు. విశాఖ జిల్లా మత్స్యకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో భీమిలి జోనల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరం నాల్గవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా తీర ప్రాంతంలో హోటల్స్ నడుపుతూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుస్తూ మత్స్యకారుల మనోభావాలను దెబ్బతీస్తున్న వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. తీర ప్రాంతంలో ఇలాంటి సంస్కృతికి అవకాశం ఇస్తే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. తీర ప్రాంతం కోతకు గురవుతుందని తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని నిపుణులు హెచ్చరిస్తున్నా... ఇలాంటి హోటల్స్‌కి అనుమతులు ఎలా మంజూరు చేస్తున్నారని అన్నారు. హుదూద్, సునామి లాంటి భయంకరమైన విపత్తులను చూసిన ప్రజలు ఇంకా ముందు ఇలాంటి విపత్తులు వస్తే వాటిని ఎదుర్కోవడానికి చేపట్టే సహాయక చర్యలకు ఇలాంటి అనుమతులు లేని బార్ అండ్ రెస్టారెంట్ లు అడ్డు వచ్చే అవకాశం ఉందని తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. మత్స్యకారులు గొప్పవారు కావాలని ఏనాడు కోరుకోరని కానీ వారి జీవనాధారం అయిన తీరంపై ఉండే వారి హక్కుకు భంగం వాటిల్లకుండా చూడాలని అన్నారు. సముద్రం మా జీవనం.. తీరం మా హక్కు అనే నినాదంతో సాగుతున్న ఈ నిరవధిక ధర్నాలో అతి సాధా రణమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు, కోశాధికారి బర్రి కొండబాబు, గ్రామ పెద్దలు వాసుపల్లి గరగయ్య, వాసుపల్లి నర్సింగరావు, పుక్కళ్ళ ఎల్లాజీ, వాసువల్లి దాసు, బుడ్డా శ్రీనివాసరావు, నక్కా రవి మరియు బోయవీధి మత్స్యకారుల సొసైటీ అధ్యక్షులు వాడమొదలు సత్యారావు, పుక్కళ్ళ అమ్మోరు, నొల్లి రమణ, సూరాడ పరదేశి, మూగి రాజు, మారుపిల్లి వాసు, మూగి రాజు, అల్లిపిల్లి అశోక్, కారి వెంకటరమణ, తెడ్డు పోలిరాజు, అల్లిపిల్లి గురువులు, బర్రి పోలిరాజు, చింతపల్లి సతీష్, కొక్కిరి మూర్తి, వాడమొదలు ధనరాజు, చింతపల్లి ఎల్లాజీ, కాసరపు కొండ, కూర్మాన నూకరాజు, బర్రి లక్ష్మణరావు, నొల్లి రాజు, సత్తరవు శివ, ఉమ్మడి మహేష్, తెడ్డు సత్తిబాబు, దూడ సోములు, బర్రి రాము, కారి ఎల్లాజీ, దూడ ఎర్రన్న, గరికిన కొర్లయ్య, వాసుపల్లి చంటి, అల్లిపిల్లి ఎల్లయ్యమ్మ, కారి ఎల్లయ్యలు, రాజాబాబు, వాసుపల్లి బండయ్య, గంటు ఆనంద్, నరేష్ పాల్గొన్నారు.

నెలలు నిండని శిశువులకు ప్రత్యేక సంరక్షణ అవసరం

బీచ్ రోడ్‌లో వాక్ థాన్‌లో వైద్యులు

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలో ప్రతి సంవత్సరం 3 మిలియన్లకు పైగా పిల్లలు నెలలు నిండకుండానే పుడుతున్నారని, ఇలా నెలలు నిండని శిశువుల పట్ల ప్రత్యేక సంరక్షణ అవసరమని పలువురు వైద్యులు అన్నారు. నగరంలోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రీమెచ్యూరిటీ డే 2024 సందర్భంగా ఆదివారం నిర్వహించిన వాకథాన్ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్ రవి చంద్రన్, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ పీడియా ట్రిషియన్, కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ బాల శ్రీ లత పులి మాట్లాడుతూ గర్భం దాల్చి 37 వారాల ముందు సజీవంగా జన్మించిన శిశు వులను ప్రీటర్మ్ అంటారన్నారు. ప్రపంచవ్యాప్తంగా డబ్ల్యు హెచ్వో నివేదిక ప్రకారం 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల మరణాలకు ప్రీమెచ్యూరిటీ ప్రధాన కారణం అన్నారు. నెలలు నిండని శిశువులకు ప్రత్యేక సంరక్షణ అవసరం అని, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో అత్యధిక స్థాయిలో నియోనాటల్ కేర్ అందించే అతిపెద్ద అధునాతన తృతీయ సంరక్షణ ఎన్ఐసీయూ (నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్) ఒకటి ఉందన్నారు. తాము నెలలు నిండని శిశువులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన ప్రత్యేక సంరక్షణను అందిస్తున్నామన్నారు. పుట్టినప్పుడు ఒక కిలో కంటే తక్కువ బరువున్న అత్యంత తక్కువ బరువున్న శిశువులకు చికిత్స చేయడంలో తమ బృందానికి నైపుణ్యం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్ బో కన్సల్టెంట్ నియోనా టాలజిస్ట్ డాక్టర్ సతీష్ వి, వైద్యులు, పీడియాట్రిషియన్‌లు, ప్రసూతి నిపుణులు వాకథాన్‌లో పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

విశాలాంధ్ర - మల్కాపురం: విద్యార్థి దశ నుండి ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆంధ్ర విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ లయన్ ఆచార్య వి.ఉమా మహేశ్వరరావు అన్నారు. స్థానిక మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో జరిగిన మెగా డాన్స్ షోను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా నిధులను సేకరించి, వాటిని నిరుపేదలకు ఖర్చు పెట్టడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ప్రతీ విద్యా సంస్థ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి తగిన ప్రాధాన్యతను ఇవ్వాలని ఆయన అన్నారు. అనంతరం డాన్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. 27 సాంప్రదాయక, జానపద, గిరిజన నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించారు. 200 మందికి పైగా ఈ పోటీలలో నృత్యం చేయడం విశేషం. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఆంధ్ర విశ్వవిద్యాలయ సంగీత మరియు నాట్య విభాగ ఆచార్యులు డాక్టర్ కె.వి.విజయవేణి, ప్రముఖ నాట్య అధ్యాపకురాలు మీనా మరియు కొరియోగ్రాఫర్ మధు వ్యవహరించారు. ఈ పోటీలలో ద్వితీయ బీ.కాం.కు చెందిన విద్యార్థినులు ప్రథమ స్థానాన్ని పొందగా, తృతీయ బీ.కాం.కు చెందిన విద్యార్థినులు ద్వితీయ స్థానాన్ని పొందారు. తృతీయ స్థానాన్ని ద్వితీయ బిఎస్సి విద్యార్థినులు మరియు ఇంటర్ ఒకేషనల్ విద్యార్థినులు సంయుక్తంగా కైవసం చేసుకున్నారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి సమన్వయ పరిచారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫుడ్ ఫెస్టివల్‌ను కూడా అధ్యాపకులు, విద్యార్థినిలు నిర్వహించారు. ఈ సాంస్కృతిక ప్రదర్శన ద్వారా మరియు ఫుడ్ ఫెస్టివల్ ద్వారా వచ్చిన నిధులను సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి తెలియజేశారు. ఈ కార్యక్రమ నిర్వాహ కులను సెయింట్ ఆన్స్ ప్రావిన్షియల్ సుపీరియర్ సిస్టర్ సాంద్రినా అభినందించారు.

శ్రీ యాజ్ఞవల్క్య పరిషత్ ప్రతిపాదిత నిర్మాణాలకు సహకరిస్తా

93వ వార్డు జీవీఎంసీ కార్పొరేటర్ రాపర్తి త్రివేణి వరప్రసాదరావు(కన్న)

ఉల్లాసభరితంగా శ్రీ సూర్య యాజ్ఞవల్క్య పీఠంలో కార్తీక సమారాధన

విశాలాంధ్ర - విశాఖపట్నం: శ్రీ యాజ్ఞవల్క్య పరిషత్ సారథ్యంలో పెందుర్తి దరినున్న గణేష్ నగర్ లో కొలువై ఉన్న శ్రీ సూర్య యాజ్ఞవల్క పీఠంలో ఆదివారం శాఖీయులు కార్తీక సమారాధనను ఉల్లాసభరిత వాతావరణంలో నిర్వహించుకున్నారు. తొలుత ఈ మేరకు జరిగిన సభా కార్యక్రమంలో గంపా గాయత్రి తన అధ్యక్షోపన్యాసంలో నిర్వహించిన పాత్రను సభ్యులకు తెలియజేశారు. కార్యదర్శి బొల్లాప్రగడ సూర్యనారాయణమూర్తి కార్యదర్శి రిపోర్టుతో పాటు జమా,ఖర్చుల తీరుతెన్నుల్ని వివరించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో పరిషత్తు పూర్వ అధ్యక్షులు పందేళ్ళపల్లి పూర్ణచంద్రరావు, పుసులూరి జగన్నాథంలు మాట్లాడుతూ ఆధ్యాత్మిక, సామాజిక దృక్పథంతో సభ్యులు కార్యవర్గ సభ్యులు నడుచుకోవాలని, సంస్థ పరిపుష్టంగా మనగలగాలంటే విరాళాలు, సభ్యుల తోడ్పాటు తప్పనిసరి కావాలన్నారు. ప్రస్తుత కార్యవర్గం పనితీరును సమీక్షించి, నూతన కార్యవర్గం ఏర్పాటులో యువత భాగస్వాములు కావాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న 93వ వార్డు జీవీఎంసీ కార్పొరేటర్ రాపర్తి త్రివేణి వరప్రసాద రావు(కన్న) మాట్లాడుతూ సంబంధిత స్థలంలో పరిషత్ చిరకాల స్వప్నమైన కళ్యాణమండపం, కాంపౌండ్ వాల్ తదితర నిర్మాణాల పట్ల తన వంతు సాయం ప్రభుత్వపరంగా చేసేందుకు అంగీకారం తెలిపారు. పి వసుంధర, పీవీ రాజగోపాల్ దంపతులు, ఎన్ రఘునాథమ్మ సహకారంతో సాగిన వనభోజనాల అనంతరం నిర్వహించిన హౌసీ, మ్యూజికల్ చైర్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు సభ్యుల్లో ఆనందోత్సాహాలు నింపాయి. కార్యక్రమ నిర్వహణలో మేడపాటి కాళీ, కొత్తపల్లి నరసింహారావు, అందుకూరి శ్రీధర్,జి చక్రవర్తి, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీతలకు సత్కారం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: డాక్టర్ ఎల్ బి కాలేజీలో గల గాంధీ సెంటర్ సెమినార్ హాలు లో బాల వికాస ఫౌండషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లు పొందిన విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన అవార్డు గ్ర హీతలకు ఆదివారం సత్కార కార్య క్రమం జరిగింది. సెంచరీ యెన్ యూనివర్సిటీ ఛాన్సెలర్ ఆచార్య జి వి ఎస్ రాజు ముఖ్య అతిధి గా, ఆచార్య బాలమోహన్ దాస్, జిల్లా విద్యా శాకాది కారి ఎన్.ప్రేమకుమార్ అతిధిలుగా పాల్గొని అవార్డు గ్రాహీత లను సత్క రించారు. కేడివి.నరసింహరావు, పి.రాజారావు, పి.నాగేశ్వరరావు, కే.గంగాదరరావు, ఎస్.రాజేంద్ర ప్రసాద్, కేఎస్ కె.నాగూర్‌లను సత్కరించారు. ఆచార్య జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ అవార్డులు కృషికి, క్రమశిక్షణకు, నిజాయితికి గుర్తింపు నకు సూచికలుగా నిలుస్తాయి అన్నారు. విద్యార్థులు అందిరిని సమదృష్టితో చూడాలన్నారు. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని మన ప్రవర్తనను విద్యార్థులు గమనిస్తూ ఉంటారని గుర్తు చేశారు. ఆచార్య బాలమోహన్ దాస్ మాటలాడుతూ ఉపధ్యాయులు కేవలము పుస్తకాల పాఠాలే కాకుండా జనరల్ నాలెడ్జి కూడా భోదించాలని అన్నారు. డి.ఈ.ఓ.ప్రేమకు మార్ అభినందనలు తెలిపారు. సమావేశానికి బాల వికాశ ఫౌండషన్ వ్యవస్థాపాక కార్యదర్శి నరవ ప్రకాశ రావు అధ్యక్షత వహించారు.

1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

- అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పీవీ రమ

విశాలాంధ్ర - విశాఖపట్నం: గిరిజనుల సంక్షేమం కోసం 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు పరచి, జివో నెం. 3 ని పునరుద్ధరించాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పీవీ రమణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం, ఎంవిపి కాలనీలోని గిరిజన భవన్ వద్ద అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జాతీయ అధ్యక్షులు పివి రమణ మాట్లాడుతూ పెసా చట్టాన్ని పటిష్టంగా ప్రభుత్వం అమలు పరచాలన్నారు. అదే విధంగా అటవీ హక్కుల సంరక్షణ చట్టాన్ని కొనసాగించాలని కోరారు. పోలవరం కోసం భూములను కోల్పోయిన నిర్వాసితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సమావేశంలో ప్రస్తుత కార్యవర్గ సభ్యులు గిరిజనుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. తర్వాత నూతన కమిటీని ఎన్నుకోనున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. ఇంకా ఈ సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షులు వి తిరుపతి రావు, రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, జిల్లా సంఘం అధ్యక్ష కార్యదర్శులు , వర్కింగ్ ప్రెసిడెంట్ అంబిడి కోటేశ్వరరావు, రూడ సత్యారావు, డిప్పాల, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.